
ప్రజాశక్తి

శుక్రవారం 29 సెప్టెంబర్ 2023



విద్యార్థి దశ విలువైంది

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యార్థి దశ భవిష్యత్తుకు ఎంతో విలువైందని మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఏజెన్సీ మహిళ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి గిరి విద్యార్థినిలకు సూచించారు. గురువారం మండలంలోని కొత్తబల్లుగుడ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు భవిష్యత్తు ప్రణాళిక, మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, విద్యార్థులకు సెల్ఫోన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థి దశ నుండే బాగా చదువుకోవాలన్నారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బందిపాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణకుమారి

యుటిఎఫ్ నిరసనలు

అసెంబ్లీలో జిపిఎస్ బిల్లును ఆమోదించడంపై..



అనంతగిరిలో జిపిఎస్ కాపీలను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనంతగిరి: ఉద్యోగ ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ బిల్లును శాసన సభలో ఆమోదించడం దుర్మార్గమని, సిపిఎస్ ఉద్యోగులకు ఇది చీకటి రోజు అని అల్లూరి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పి.దేముడు, ఉమ్మడి జిల్లాల సహాయ అధ్యక్షులు శెట్టి రాంబాబు ఆధ్వర్యన చిలకగెడ్డ పాఠశాల ఆవరణలో జీవో కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానాన్ని వారంలోపు రద్దు చేస్తామని చెప్పిన సిఎం జగన్ మాట మార్చారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పి నాలుగున్నర ఏళ్ల తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా శాసనసభలో జిపిఎస్ బిల్లును ఆమోదించి హామీని శాసనసభ సాక్షిగా అపహాస్యం చేశారన్నారు. జిపిఎస్ వద్దని పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్యారంటీ లేని పెన్షన్ స్కీమును ఆమోదించి ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వంచిందని ఆరోపించారు. ఏ రాష్ట్రంలో లేని కొత్త విధానం దేశానికి ఆదర్శమని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల నుండి కాంట్రిబ్యూటరీ కట్టించుకునే విధానం దేశానికి ఆదర్శమని ఎలా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఉద్యోగ ఉపాధ్యాయుల భిన్నంగా ముందుకెళుతున్న ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదన్నారు. భవిష్యత్తులో జిపిఎస్ చట్టం రద్దు, పాత పెన్షన్ సాధనకు కలిసొచ్చే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి టి .రామకృష్ణ నాయుడు, మండల కోశాధికారి ఎస్.రమేష్, మండల కార్యదర్శులు బి.సింహాచలం . బి.విజయ్ కుమార్ బి.సింహాచలం, జి .పరశురాం తదితరులు పాల్గొన్నారు

జిపిఎస్‌తో ప్రభుత్వం మోసం: యుటిఎఫ్

దుంబ్రిగుడ: వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగులను నిలువునా మోసం చేసిందని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలో వచ్చిన వెంటనే వారం రోజులలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేటికి నాలుగున్నరేళ్ళు గడిచినా రద్దు చేయలేదని, దీనికి తోడు జిపిఎస్‌ని తెచ్చి ఉద్యోగులను నిలువునా మోసం చేశారన్నారు. సిపిఎస్ కంటే జిపిఎస్ దుర్మార్గమైన పెన్షన్ స్కీమ్ అని, కేవలం ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ నుండి తప్పించుకోవాలని ఆ నిధులను ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. ఇందుకు సిపిఎస్ ఉద్యోగుల జీవితాలను పణంగా పెట్టిందన్నారు. ఓ పిఎస్‌లో ట్రిపుల్ బెనిఫిట్స్ ఉండగా జిపిఎస్‌లో ఎటువంటివి లేవన్నారు. సిపిఎస్ కంటే జిపిఎస్ మెరుగైందని చెప్పి ఉద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నిరంకుశమైన విధానాలను యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మోసం చేసిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాధించవని చరిత్ర చెప్తుందన్నారు.జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కౌన్సిలర్ కన్నయ్య, యం.మోహన్, కే.బాబ్జి, మండల కమిటీ నాయకులు మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

30న ఉపాధ్యాయుల ధర్నా

పాడేరు టౌన్: ఉపాధ్యాయ సమస్యలతో పాటు, విద్యా రంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 30న ధర్నాను నిర్వహిస్తామని, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.జగన్ మోహన్ రావు, కె.ధనుర్జయ, ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్ సంయుక్తంగా గురువారం ప్రకటన విడుదల చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పాఠశాలల విలీనాన్ని వెంటనే ఆపి విద్యా వ్యవస్థను పరిరక్షించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలతో విద్యారంగం అస్తవ్యస్తంగా తయారవుతోందని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బుజ్జిబాబు

వైసిపి నయవంచన

ప్రజాశక్తి -సీలేరు

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించడం ద్వారా ఆదివాసీ గిరిజనులకు వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు మండిపడ్డారు. అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గూడెం కొత్తవీధి మండలకేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ, నిజమైన గిరిజనులతో పోలిస్తే, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో పురోభివృద్ధి చెందిన బిసి'ఎ'లో 40 లక్షల మంది గిరిజనేతర బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడం నిజమైన ఆదివాసీలను ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. నన్ను నమ్మండంటూ, నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదివాసీలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నయవంచనకు గురిచేశారన్నారు. జిఒ 3 రద్దయి మూడేళ్లవుతున్నా దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో చింతపల్లి, అనంతగిరి తదితర ఏజెన్సీ మండలాల్లో సహజవనరులు, కొండలను ప్రయివేటుకు అప్పగించడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్మోహనరెడ్డి గడచిన నాలుగున్నరేళు గా ఆదివాసీలను అన్ని విధాలా అన్యాయానికి గురిచేస్తున్నా, గిరిజన ఓట్లతో గెలుపొందిన ఎంపీ, ఎమ్మెల్యేలు మౌనం వహించడం గిరిజనులకు ద్రోహం చేయడమేనన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులు ఆదివాసీల వెంట ఉంటారో, లేదో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. తక్షణం స్పందించకుంటే మన్యవాసులను సమాయత్తం చేసి, సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు బాలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

5న ఉక్కు బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, చిన్నయ్యపడాల్ తదితరులు

ప్రజాశక్తి- పాడేరు: విశాఖ ఉక్కు రక్షణ కై అక్టోబర్ 5న స్టీల్ ప్లాంట్ వద్ద జరిగే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స పిలునిచ్చారు. పాడేరు సి.పి.ఎం జిల్లా కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, మండల కార్యదర్శి.ఎల్.సుందర్‌రావు, జిల్లా కమిటీ సభ్యుల కె.ప్రభు దాస్, మండల నాయకులు సతీష్ తో కలిసి విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక మంది త్యాగాలతో సాధించుకున్న మణిహారం విశాఖ స్టీల్ ప్లాంట్ లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ 3 లక్షల కోట్ల ఆస్తి కలిగి వుందన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం 4980 కోట్లు పెట్టుబడి పెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తుందన్నారు. స్టీల్ ప్లాంటు కార్మికులు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు 950 రోజులకు పైగా పోరాడుతున్నారని తెలిపారు. స్టీల్ ప్లాంటును కాపాడాల్సిన అధికార, ప్రతిపక్ష తెలుగుదేశం, అన్యాయాన్ని ప్రశ్నిస్తానన్న జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వం ముందు సాగిల పడుతున్నాయన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు జగ్గునాయుడు, కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర నేతలు కిల్లో సురేంద్ర, బి.ప్రభావతి, టి. సూర్యనారాయణ తదితరులు హాజరు కానున్నారన్నారు.



భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

భగత్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు: భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక గిరిజన సంఘం భవనంలో గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రభు మాట్లాడుతూ, భగత్ సింగ్ నేటి యువతరానికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. సంపూర్ణ స్వాతంత్రం కోసం పాటు పడిన భగత్ సింగ్‌ని స్ఫూర్తి తీసుకొని యువత అంతా ముందుకు రావాలని కోరారు. భగత్ సింగ్ పుస్తక పట్టణం ఎక్కువగా చేసేవారని ఆయనకు దేశభక్తి ఎక్కువ ఉండేదన్నారు. స్వతంత్ర ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని చిన్న వయస్సు నుండే ఉద్యమ పోరాట పటిమ ఉండేదని చెప్పారు. యువత అందరూ ఆయన ఆశయాల కోసం అడుగు జాడల్లో నడవాలన్నారు. అప్పుడే భగత్ సింగ్ కు సంపూర్ణమైన నివాళి అర్పించినట్టు అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిన్నా రావు, జిల్లా అధ్యక్షులు జీవన్ కృష్ణ, జిల్లా కమిటీ నాయకులు కార్తీక్ సింహాద్రి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, అంగన్‌వాడీలు

30న అంగన్వాడీలతో ప్రధాని ముఖాముఖి

ట్రయల్ నిర్వహించిన ఐటిడిఎ పిఒ, అధికారులు

ప్రజాశక్తి-రంపచోడవరం

కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్, సంకల్ప సత్‌హ కార్యక్రమం ప్రారంభోత్సవ సందర్భంగా ఈనెల 30న ప్రధానమంత్రి నరేంద్రమోడీ అంగనవాడీ కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహిస్తారని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే తెలిపారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా, రంపచోడవరం డివిజన్‌లోని మారేడుమిల్లి. వై రామవరం. గంగవరం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలతో గురువారం సాయంకాలం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సమాయత్త సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ పౌష్టికాహారం పంపిణీ, ఇతర సేవలపై ఢిల్లీ

'గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-జి.మాడుగుల: జి.మాడుగుల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో గురువారం వంట పనులు చేయించిన ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పాంగి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు.స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ,గిరిజన ప్రాంతంలో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పకుండా వంట పనులు చేయించడం సరికాదన్నారు. గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో పూర్తి స్థాయి వార్డెన్లు లేక ఈ సమస్య తలెత్తుతుందన్నారు. ఏజెన్సీ 11 మండలాల గురుకుల . ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయలేదన్నారు. విద్యార్థి, ప్రజా సంఘాలకు గురుకులాల్లో అనుమతి లేకుండా చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.

'నిందితులను శిక్షించాలి'

ప్రజాశక్తి-జి.మాడుగుల: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం ఠాణా వేణుగోపాలపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ హత్యకు కారకులైన వారికి శిక్షించాలని మండల కేంద్రంలో గురువారం అరకు పార్లమెంట్ టి.ఎన్.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య టి.ఎన్.ఎస్. ఎఫ్ ప్రధాన కార్యదర్శి వనుగు త్రినాథ్ మాట్లాడుతూ, హత్యకు పాల్పడిన వారి పై కఠిన శిక్ష వేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసమే దిశ చట్టం తీసుకో వచ్చినా దోషులకు శిక్ష పడేటట్టు లేదన్నారు. తప్పు చేసిన ముగ్గురు యువకులకు కఠినంగా శిక్షించి భవ్యశ్రీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

- ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు వెలవెల

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు సమాచారం లేకుండా గత రెండు, మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంతో మండల కేంద్రంలోని ఆధార్, మీ సేవ, ఇంటర్నెట్, ఫొటో స్టూడియో, జెరాక్స్ సెంటర్‌లు వెలవెలబోయాయి. మారుమూల గ్రామాల నుండి వివిధ పనులు నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. బ్యాంక్ లావాదేవీలు పూర్తిగా నిలిచి పోయాయి. చేసేది లేక ఆయా గ్రామాలకు ప్రజలు తిరిగి వెళ్ళిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గుంట గన్నెల పంచాయతీ పిత్తగూడ గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్పర్సన్ పి శాంతకుమారి ఆధ్వర్యంలో పలువురు చేరారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని వైసిపి యువ నాయకుడు తో పాటు మరో 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు శాంత కుమారి చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పిత్తగూడ గ్రామంలో డ్రైనేజీ, సిసి రోడ్లు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి, మండల ప్రధాన కార్యదర్శి టి.భీమారావు, మండల అధ్యక్షుడు జగన్నాథం, పరశురాం, మితుల పాల్గొన్నారు.

నేడు డుంబ్రిగుడలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-పాడేరు: డుంబ్రిగుడలో ఈనెల 29న శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రకటించారు. డుంబ్రిగూడ ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.

పునరావాస కాలనీల్లో సమస్యల తిష్ట

-అసంపూర్తిగానే ఇళ్ల నిర్మాణాలు

-అరకొరగానే అభివృద్ధి పనులు

-తుష్టివారిగూడెం నిర్వాసిత కాలనీ సందర్శనలో సిపిఎం బృందం



అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి -విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు కారణంగా పునరావాసం పొందిన మండలంలోని తుష్టివారిగూడెం గ్రామానికి చెందిన నిర్వాసిత కాలనీలను సిపిఎం బృందం గురువారం పర్యటించింది. ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచులు లక్ష్మి, పూనం సరోజిని, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, సోయం చినబాబు కూడిన సిపిఎం నేతల బృందం ఆయా కాలనీలను సందర్శించి, అక్కడి ప్రజలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతులు కనీసస్థాయిలో లేకపోవడాన్ని గుర్తించారు. స్థానికులు తమ సమస్యలను సిపిఎం నేతలకు విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆర్భాటంగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించినప్పటికీ, ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముఖం చాటేశారన్నారు. పాఠశాల, అంగన్వాడీ భవనాలు, గుడి, డ్రైనేజీలు, రోడ్లు ఇలా నిర్మాణ పనులను ప్రారంభించినప్పటికీ, పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. కాపవరం వద్ద ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన సిపిఎం నేతలు, అక్కడ కొన్ని ఇళ్లు పూర్తయినప్పటికీ, నిర్మాణదశలో అనేక ఇళ్లు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సిఎం జగన్మోహనరెడ్డి స్పందించి మిగిలిన ఇళ్ల నిర్మాణాలతోపాటు అక్కడ విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ఇతర సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టాలని కోరారు.కార్యక్రమంలో సిపిఎం నేతలు పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు,సోడి మల్లయ్య, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

యథావిధిగా ఆర్‌టిసి నైట్ సర్వీసులు

-ప్రశాంతంగా ముగిసిన మావోయిస్ట్ ఆవిర్భావ వారోత్సవాలు

-ఊపిరి పీల్చుకున్న ప్రజలు, అధికారులు

ప్రజాశక్తి -సీలేరు: మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయి. దీంతో ఏజెన్సీవాసులతోపాటు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో వారం రోజులుగా ఏజెన్సీలో నిలిచిపోయిన ఆర్‌టిసి నైట్‌సర్వీసులను, గురువారం రాత్రి నుంచి యథావిధిగా పునరుదర్ధరిస్తున్నట్లు ఆర్‌టిసి అధికారులు వెల్లడించారు. మధురవాడ ఆర్‌డిసి డిపోకు చెందిన నైట్ బస్ సర్వీసులు రెండు, అలాగే సీలేరు నైట్ హాల్ట్ మరొక సర్వీసు యథావిధిగా కొనసాగుతుందన్నారు. విశాఖ నుంచి నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్సు సర్వీసులు కూడా యథావిధిగా తిరుగుతాయని, వీటికి సంబంధించి ముందస్తు టికెట్ రిజర్వేషన్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని, ప్రయాణికులు గమనించాలని ఆర్‌టిసి అధికారులు కోరారు.

10 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి లక్కవరం జంక్షన్ వద్ద 10 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తుల వద్ద నుండి 10 కేజీల గంజాయితో ఉన్న బ్యాగును మోతుగూడెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు



కొమరం ప్రవల్లికను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రవల్లిక

ప్రజాశక్తి - రంపచోడవరం

అండర్ -17 రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని కె.ఎర్రంపాలెంరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని కొమరం ప్రవల్లిక ఎంపికైందని హెచ్ఎం వై.లక్ష్మి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లాల (కోనసీమ, తూర్పుగోదావరి; కాకినాడ, అల్లూరి నాలుగు జిల్లాల)కు సంబంధించి అనపర్తి జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియలో ప్రవల్లిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రపోటీలకు ఎంపికైందని తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రపోటీలకు ఎంపికైన ప్రవల్లికను, ఆమెను తర్ఫీదునిచ్చిన పీడీ సుగంధి, పిఇటి గౌరీశంకర్‌లను హెచ్ఎం లక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో సిఆర్పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో స్వచ్ఛత అభియాన్ క్యాంపులో భాగంగా మత్తు పదార్థాలపై ర్యాలీ గురువారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభించి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. మత్తు పదార్థాలకు ప్రజలు బానిసలు కావద్దు, మీ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ డిఎస్పి సురేష్ సైనిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30 వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఆరోగ్యకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తమని తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశామన్నారు. ఖైనీ, గుట్కా, పాన్, సిగరెట్టులకు దూరంగా ఉండాలని సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

విచారణ నివేదిక బహిర్గతం చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-అరకులోయ: నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం పై జరిపిన విచారణ నివేదికను అధికారులు బహిర్గతం చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన భవన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన సంఘ మండల అధ్యక్షులు జి.బుజ్జి బాబు మాట్లాడుతూ,ఉద్దేశ్య పూర్వకంగా పిట్టల రాంబాబు అనే గిరిజ నేతరుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొందారని స్పష్టం చేశారు. పిట్టల రాంబాబు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రెవెన్యూ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి నకిలీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని తెలిపారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన రెవిన్యూ అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈనెల 5న ఐ.టీ.డీ.ఎ పీవో కు ఫిర్యాదు చేసామన్నారు.ఈ విషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ ఈనెల 12న, 20 తేదీల్లో విచారణ జరిపించారని తెలిపారు. విచారణ జరిపి వారం రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందిన పిట్టల రాంబాబు పై సర్టిఫికెట్ జారీ చేసిన రెవెన్యూ అధికారుల పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి నకిలీ కుల ధ్రువీకరణపై జరిగిన విచారణలో ఎటువంటి చర్యలు తీసుకొన్నారో అరకులోయ మండల తహశీల్దార్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.నకిలీ ఎస్టి కుల దవీకరణ పత్రం పొందిన పిట్టల రాంబాబు పై, సర్టిఫికెట్ జారీ చేసిన రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కిల్లో జగన్నాధం, టి. జోషి పాల్గొన్నారు.

16వ రోజుకు టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ, మాజీ ఎమ్మెల్యే ,టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో 'బాబుతో నేను' నిరసనలో భాగంగా చేపడుతున్న రిలేదీక్షలు గురువారం 16వ రోజుకు చేరుకున్నాయి. దీక్షాశిబిరానికి మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు వచ్చి, దీక్షలో పాల్గొన్న గంగవరం మండల టిడిపి నేతలకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కారం సురేష్‌బాబు, పాము అర్జున్, మరిసెట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, దుమ్ముల భానుప్రకాష్, గొర్లె సునీత, కనిగిరి రాంబాబు, అడబాల బాపిరాజు, సంఘం శ్రీకాంత్, వై.నిరంజన్‌దేవి, తైలం గంగాధరరావు, తీగల ప్రభ, మట్టం విజయభాస్కర్, దిడ్డి జనార్ధన్, కోసు బుల్లయమ్మ, కుంజం బాపన్నదొర వైఎస్.బోస్, దారా వెంకన్న, పల్లాల రమణారెడ్డి, పామర్తి వీరబాబు, బండి రమణ, జెట్లకోటమూరి స్వామి, కమ్మర రాంబాబు, స్వర్ణ, రాజు, నల్లబాబు, నర్సన్న, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గోండ్వాన గణతంత్ర పార్టీ నూతన కమిటీ



ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు : గోండ్వాన గణతంత్ర పార్టీ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక మండలంలోని పోతనపల్లి గ్రామంలో గురువారం పార్టీ ఆదివాసి అధ్యక్షులు సోడె అర్జున్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షులుగా కారం రవి, ఉపాధ్యక్షునిగా మడకం కన్నారావు, కార్యదర్శిగా కుంజా శ్రీను, ఉప కార్యదర్శిగా గడిని ముత్తేష్, సంయుక్త కార్యదర్శిగా పోడి ముత్తయ్య, కోశాధికారిగా పీసం దూలయ్య, సాంస్కృతిక విభాగానికి బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మడివి రాము, మడివి అర్జున్, కుంజా అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎపి అధ్యక్షులు కారం రవి మాట్లాడుతూ గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 1/70, పీసా చట్టాలు అమలు చేయాలని, జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ కమిటీ సభ్యులు ఈసం సంజీవరావు, కనిబోయిన వెంకట నరసయ్య, దౌలత్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న స్విచ్ యార్డ్ 33 కెవిలైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీ జెన్కో ఓడీ యండ్ ఎడిఈ శ్రీకాంత్ వెల్లడించారు. దీనికి స్థానిక ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు సహకరించాలని కోరారు. 33 కెవిలైన్ లో బస్సు పిల్లలు విద్యుత్ సరఫరా ఎంత అవుతుందో తెలియజేస్తాయని, ఈ క్రమంలోనే ఇవి గురువారం ఉదయం పరిశీలించగా డ్యామేజీ గుర్తించినట్లు గుర్తించడమని తెలిపారు. విద్యుత్ సరఫరా జరిగినపుడు ప్రొటెక్షన్ కోసం దోహదపడతాయని, వీటి లోపాలు సవరించి మళ్లీ వాటి స్థానంలో అమర్చడం జరుగుతుందని పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భద్రతా పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు.



రద్దయిన రైళ్ల వివరాలు

07466 రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 2 నుంచి ఎనిమిదో తేదీ వరకు రద్దు చేశారు. అదేవిధంగా 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 3 నుండి 9 వరకు రద్దు చేశారు. 22702 విజయవాడ-విశాఖపట్నం, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా వచ్చేనెల 2,3,4,6,7 తేదీలల్లో రద్దు చేసినట్లు వెల్లడించారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు

13351 ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ ఒకటి నుంచి ఆరో తేదీ వరకు. అలాగే అక్టోబర్ 8న, 12889 టాటానగర్-ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 6న, 18111 టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 5న, 12835 హతియా-ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 1,3,8 తేదీల్లో, 12376 జసిడిహ్-తాంబరం ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 4న, 22837 హతియా-ఎర్నాకులం ఎసి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2న సాధారణ మార్గమైన తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా కాకుండా, నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుందన్నారు. ప్రజలు మార్పులను గమనించాలని సూచించారు.

వీక్లీ ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పలు వీక్లీ ప్రత్యేక రైళ్లను పొడిగించిందని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె. త్రిపాఠి తెలిపారు. 08579 విశాఖపట్నం-సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు అక్టోబర్ 4 నుంచి నవంబర్ 29 వరకు ప్రతి బుధవారం రాత్రి 7గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి,మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.అలాగే 08580 సికింద్రాబాద్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి గురువారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08583 విశాఖపట్నం-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి సోమవారం రాత్రి 7 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ అక్టోబర్ 3 నుండి నవంబర్ 28 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

'ఉక్కు' సంకల్పం.. ఉత్తేజపూరితం



అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

- తొమ్మిదో రోజుకు చేరిన స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర
- చైతన్యం రేకెత్తించిన నేతల ప్రసంగాలు
- కర్మాగారం జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- ఆకట్టుకున్న కళారూపాలు

ప్రజాశక్తి - గాజువాక : సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుంచి ప్రారంభమైన ఉక్కు రక్షణ బైకు యాత్ర గురువారం గాజువాక నియోజకవర్గంలో ఉత్తేజపూరితంగా సాగింది. 'ఉక్కు' సంకల్పంతో యాత్రా బృందం నివాస ప్రాంతాల్లో కలియదిరిగింది. ఊరూవాడనూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఐక్యం చేసింది. స్టీల్‌ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద యాత్ర ప్రారంభమై దుర్గానగర్, దిబ్బపాలెం, శ్రీరామనగర్, శ్రీనగర్, ముస్తాఫా జంక్షన్, ఫకీర్‌తక్యా, తోకాడ సమైక్య అపార్టుమెంట్, పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల గుండా సాగి అక్కిరెడ్డిపాలెంలో ముగిసింది. తొలుత ఉక్కు అమరవీరుడు అమృతరావు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అక్కడి నుంచి సాగిన యాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. యాత్రా బృందంపై పూలుజల్లుతూ ప్రజలు అభిమానాన్ని చాటుకున్నారు. ఫకీర్‌తక్యాలో ముస్లిం సోదరులు యాత్రా బృందానికి మద్దతు ప్రకటించారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదం హోరెత్తింది.

పలుచోట్ల జరిగిన సభల్లో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ విషయంలో మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎక్కడా అడ్డుకోవడం లేదన్నారు. అధికార వైసిపి అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుందన్నారు. వైసిపి, టిడిపి, జనసేనలు తమలో తాము కలహించుకోవడం లేదా కౌగిలించుకోవడం తప్ప రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని మాత్రం పల్లెత్తు మాట అనడం లేదన్నారు. అదే అవకాశంగా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను అష్ట దిగ్బంధనం చేస్తోందన్నారు. ఎన్ఎండిసి నుంచి తక్కువ ధర చెల్లించి ఇనుప ఖనిజాన్ని కొనుగోలు చేసేందుకు అనుమతించకుండా తీవ్ర విఘాతం సృష్టిస్తోందన్నారు. మరోపక్క విదేశాల నుంచి దిగుమతి చేస్తున్న కోకింగ్ కోల్‌ను అన్‌లోడ్ చేయకుండా అదానీ గంగవరం పోర్టు దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. వంద శాతం వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక వర్గాన్ని పక్కదోవ పట్టించే విధంగా పాలకుల చేష్టలు ఉన్నాయన్నారు. అన్ని విధాలా స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచి కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు మోడీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. పోరాటాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం రాష్ట్ర ప్రజల చైతన్యం మీదే ఆధారపడి ఉందని, కనుక ఈ పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. యాత్ర రథసారథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ వలసలతో ఉత్తరాంధ్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విశాఖ స్టీల్‌ప్లాంట్ కొంతవరకూ అరికట్టిందన్నారు. ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమలో దళితులు, గిరిజనులు, బిసిలకు రిజర్వేషన్ల ద్వారా ఉపాధి లభిస్తోందని తెలిపారు.

ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తే వారికి ఉపాధి ఎలా సాధ్యమవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి అట్టడుగుకు చేరిందన్నారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు మరింత విస్తృతమైన మద్దతును కూడగట్టేందుకే తమ పార్టీ ఈ బైకు యాత్ర చేపట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ పాలకుల మెడలు వంచి పోరాడి సాధించుకున్న ఈ ప్లాంట్‌ను తిరిగి ఆ పోరాటాలతోనే నిలబెట్టుకుంటామన్నారు. ఉక్కు రక్షణ కోసం అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యాత్రలో సిపిఎం నాయకులు కెఎం.శ్రీనివాసరావు, బి.జగన్, ఎన్.రామారావు, జ్యోతీశ్వరరావు, వైటి.దాస్, శ్రీనివాసరాజు, ఎం.రాంబాబు, రాజేంద్రప్రసాద్, సంతోషం, వై.లక్ష్మణ్, లోకేశ్వరరావు, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తోకాడ సమైక్య అపార్టుమెంట్ మహిళల కళా ప్రదర్శనలు

ఫకీర్‌తక్యా నుంచి ఆటోనగర్ మీదుగా తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌కు చేరుకున్న యాత్రా బృందానికి ఘన స్వాగతం లభించింది. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి యాత్రా బృందం నుదుటను బొట్టు పెట్టి స్వాగతం పలికారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, తవిటయ్య, నాయకులు రమణ, చిన్నంనాయుడు, తౌడన్న, సిరి, గ్రీన్‌లైఫ్ అపార్టుమెంట్ వాసులు యాత్రకు ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. సమైక్య అపార్టుమెంట్ మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం, ఇతర కళారూపాలు ఆకట్టుకున్నాయి.



బైక్ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం నేతలు



తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ మహిళల కళా ప్రదర్శన

సీతాఫలాలకు భలే గిరాకీ!

- సీజన్‌లో ఏజెన్సీ పొడుగునా అమ్మకాలు
- వారపుసంతలు, రోడ్ల వెంబడి విరివిగా దుకాణాలు
- గిరిజన రైతులకు అదనపు ఆదాయాన్నిచ్చే ఫలాలు



కాశీపట్నం వారపుసంతకు అమ్మకానికి తెచ్చిన సీతాఫలాలు

ప్రజాశక్తి- అనంతగిరి : రుచి, నాణ్యతలో మిన్నగా ఉండే మన్యంలోని సీతాఫలాలకు మంచి గిరాకీ ఉంది. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సీజనల్‌గా సీతాఫలాలు లభిస్తాయి. అనంతగిరి, డముకు, కాశీపట్నం వారపుసంతలలో కావిడీలు, బుట్టలలో గిరిజన రైతులు వీటిని విక్రయానికి తెస్తుంటారు. కావిడి సీతాఫలాలకు రూ. 1200 నుంచి రూ.1800 వరకు ధర పలుకుతుంది. ఎస్.కోట, విజయనగరం, విశాఖ తదితర మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చి, భారీస్థాయిలో సీతాఫలాలను కొనుగోలు చేసి తరలిస్తుంటారు. మైదాన ప్రాంతంలో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో అనంతగిరి ఏజెన్సీలోని సీతాఫలాలను కొనేందుకు వ్యాపారులు ఎగబడి వస్తుండడం విశేషం.

చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అందరూ అమిత ఇష్టంగా తినే సీజనల్ సీతాఫలంలో పోషకాలు మెండుగా ఉండడంతో పాటు, గుండెపోటు, మధుమేహం, రక్తహీనత, ఆస్థమా వంటి పలు అనారోగ్య సమస్యలకు చెక్‌పెట్టే ఔషధిగా గుర్తింపు ఉండడంతో వీటికి భలే డిమాండ్ ఉంటుందనే చెప్పాలి. దీంతో అనంతగిరి, అరకు పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే విదేశీ, ఇతర ప్రాంతాల సందర్శకులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా స్థానిక గిరిజన రైతులు రోడ్ల వెంబడి బుట్టలతో ఉంచి అమ్మకాలు సాగిస్తుంటారు. అటుగావచ్చిన వారంతా సీతాఫలాల దుకాణాల వద్దఆగి, ఎన్నో కొన్ని కొనకుండా వెళ్లరంటే అతిశయోక్తి కాదు. కాశీపట్నం, డముకు, అనంతగిరి, బొర్రా జంక్షన్ తదితర ప్రాంతాల్లో సీజన్‌లో రోడ్డు వెంబడి ఇరువైపులా సీతాఫలాల దుకాణాల దర్శనమివ్వడం ఇక్కడ పరిపాటి.

మండలంలోని ఎన్ఆర్ పురం, రొంపల్లి, వేంగడ, వాలాసి, పెద్దబిడ్డ, గుమ్మ, భీంపోలు, గుమ్మకోట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని గిరిజన రైతులు సీతఫలాల తోటలు పెంపకానికి మొగ్గు చూపుతున్నారు. సాంప్రదాయ పంటలకు వచ్చే ఆదాయంతో పోలిస్తే, కనీసస్థాయి పెట్టుబడి, యాజమాన్య పద్ధతులతో పండించే సీతాఫలాల సాగుతో గిరిజన రైతులకురూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడం ద్వారా వారికి ఆర్థిక ఆసరాగా సీతాఫలాలు ఉంటున్నాయి.

వర్సిటీల్లో అంతరిక్ష పరిశోధనలకు ఇస్రో సహకారం

గీతంలో ఇస్రో శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్



ఇస్రో శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : విద్యార్థులు, యువ పరిశోధకులు చంద్రయాన్ వంటి అంతరిక్ష ప్రయోగాల విజయాల నుంచి స్ఫూర్తి పొందుతున్నారని, వారిని ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయాలలో అంతరిక్ష శాస్త్ర పరిశోధనలకు ఇస్రో సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని ఇస్రో అట్మాస్ఫియరిక్ అండ్ స్పేస్ సైన్స్ ఏవియానిక్స్ చెక్ అవుట్ డివిజన్ డిప్యూటీ డైరక్టర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్, ఇఇసిఇ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాలు వందకు పైగా అంతరిక్ష ప్రయోగాలు జరిపినప్పటికి చంద్రుడిపై నీటి జాడలను గుర్తించిన ఘనత మాత్రం భారత్‌కే దక్కిందని చెప్పారు. ఈ ఏడాది రష్యా, జపాన్ తదితర దేశాలు చేసిన ప్రయోగాలు విఫలం కాగా ఇస్రో చంద్రయాన్ విజయం సాధించడం వెనక వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు కారణం అన్నారు. భారత అంతరిక్ష ప్రయోగాలు విజయ వంతం కావడంతో ఇతర దేశాలు సహకారం కోరుతూ ముందుకు వస్తున్నాయని తద్వారా పెద్దఎత్తున ఆర్థిక వనరులు లభిస్తాయని పేర్కొన్నారు. అంతరిక్ష ప్రయోగాలలో ఉపగ్రహల బరువును నిర్ధేశించడంలో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విక్రమ్ సారాబాయ్ వేసిన పునాది ఫలితంగా భారత దేశం అంతరిక్ష రంగంలో దూసుకు వెళుతోందని అన్నారు. కార్యక్రమంలో ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సెవెన్తలైన్, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జిసిజిసి) డైరక్టర్ వంశీ కిరణ్ సోమయాజుల, డాక్టర్ ఉమాదేవి, డిప్యూటీ డైరక్టర్ ఎ.అనిల్ కుమార్, కాంపిటెన్స్ డెవలప్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ రోజినా మాథ్యూస్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, వివిధ విభాగాల అధ్యాపకులతో సమావేశమయ్యారు.

వహీదాకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అభినందన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలో మూలాలు కలిగి, భారతీయ సినీ పరిశ్రమలో అత్యున్నతస్థాయికి ఎదిగిన 87ఏళ్ల బాలీవుడ్ నటి వహీదా రెహమాన్‌కు ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, జీవన సాఫల్య పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రకటించడంపై వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

వహీదా తండ్రి ఉద్యోగ రీత్యా కొన్నేళ్ల పాటు విశాఖలో ఉన్నారని, అప్పట్లో వహీదా సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ లో చదువుకున్నారన్నారు. తెలుగులో 'రోజులు మారాయి' చిత్రంలో ఏరువాక సాగారో అన్న పాటలో నటించిన వహీదా, అంచెలంచెలుగా ఎదిగి, బాలీవుడ్‌లో అగ్రనటి స్థాయికి ఎదగడం, ఇపుడు దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు దక్కడంపై నగరవాసుల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన విద్యార్థికి వైద్య సీటు



కె.ఇస్సా

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో చదువుకొని నీట్ -2023 ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులలో ఈదులబయలు గ్రామానికి చెందిన కె.ఇస్సా వైద్య సీటు సంపాదించాడు. కె.సత్తిబాబు, మహేశ్వరి కుమారుడైన ఇస్సా నీట్‌లో 420 మార్కులు సాధించాడు. ఆలిండియా ఎస్‌టి కేటగిరీలో 3073వ ర్యాంకు వచ్చింది. విశాఖపట్నం ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. ఇస్సా 5వ తరగతి వరకు ఎంపిపి స్కూల్ చిన్నకొత్తూరు గ్రామంలోనూ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు డౌనూరు ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్, నీట్ శిక్షణను గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ మారికవలసలో విద్యనభ్యసించాడు.

ఎంబిబిఎస్ మొదటి విద్యా సంవత్సర ఫీజు రూ.1,65,500ను రూ. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ అందించి విద్యార్థికి ఆర్థిక సహాయం చేసినట్లు శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. గిరిజన విద్యార్థులు తమ శిక్షణా సంస్థ నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడి ఎంబిబిఎస్ సీటు సంపాదించడం అభినందనీయమన్నారు. శిక్షణా సంస్థను, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌కు, పాడేరు ప్రాజెక్టు అధికారికి ధన్యవాదాలు తెలిపారు.

అధ్వాన రహదారితో అవస్థలు



అధ్వానంగా రహదారిలో దిగబడిన ట్రాక్టర్

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని దొడ్డవారం నుండి చీడిపాలెం వెళ్ళే రహదారి చాలా అధ్వానంగా ఉంది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఇటీవల కురిసన వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. గోతుల్లో నీరు చేరడంతో ఊబిలా మారి, వాహనాలు దిగబడిపోతున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా ఇలాగే చాలా వాహనాలు దిగబడిపోయినా ఈ రహదారి మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో బిటి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పంట నమోదు వేగవంతం

ప్రజాశక్తి -కొయ్యూరు : పంట నమోదు వేగవంతం చేసినట్లు వ్యవసాయ శాఖ ఏవో ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదు పారదర్శకంగా జరుగుతోందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలో 60 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మరో మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని ఏవో వెల్లడించారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

ప్రజాశక్తి అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న జరిగే జగన్నకు చెబుదాం కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు స్థానిక ఎంపీడీవో కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణంగా వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా గణపతి నిమజ్జనం

ప్రజాశకి-మోతుగూడెం : చింతూరు మండలం, ఫార్బయ్ గ్రామంలో గురువారం ఉత్సాహంగా గణపతి నిమజ్జనం జరిగింది. చిన్నలు, పెద్దలు అందరూ ఆట పాటలతో, డిజె సౌండ్స్ మధ్య వినాయకుడిని ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గణపతికి సమర్పించిన లడ్డుని వేలం పాటలో డొంకరాయి గ్రామస్తుడు ఎర్రి రాములు రూ.4500కు దక్కించుకున్నారు.

అల్లం నూకరాజుకు నివాళి



నివాళులర్పిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు : సిపిఐ నాయకులు, మాజీ సర్పంచ్ అల్లం నూకరాజు సంస్మరణ సభ మండలంలోని కొమ్మిక పంచాయతీ డేగలపాలెం గ్రామంలో పార్టీ నాయకులు, కుటుంబం సభ్యుల ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ మండల నాయకులు మాట్లాడుతూ సిపిఐ అజాతశత్రువు, పేదల మనిషిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పట్టిన సత్యనారాయణ. ఇరువాడ దేవుడు, రావణాపల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవాణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు



పరామర్శిస్తున్న ఎటిడబ్ల్యుఒ, హెచ్ఎం

ప్రజాశక్తి- అరకులోయ: విద్యుదాతానికి గురై ఓ గిరిజన విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అరకులోయ మండలంలోని కొత్త బల్లు గూడ పంచాయతీ గద్యగూడ గ్రామానికి చెందిన వంతల అప్పలరాజు(12) మండలంలోని లోతేరు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. స్కూల్ నుంచి గురువారం ఉదయం ఇంటికి వస్తూ , గ్రామ సమీపంలోని కొత్తగా వేసిన రైల్వే ట్రాక్‌లోని కరెంట్ ఫోల్ అనుకోకుండా ఎక్కడంతో విద్యుత్ షాక్ కు గురై కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న తోటి పిల్లలు కుటుంబీకులకు, బంధువులకు తెలిపారు. గద్యగుడ గ్రామ వాలంటీర్ స్వాభి రాజబాబు ఆటోలో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కెజిహెచ్‌కు తరలించారు. విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైన మండలంలోని లోతేరు గిరిజన సంక్షేమ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి వంతల అప్పలరాజును కేజీహెచ్‌లో అరకులోయ ఏటిడబ్ల్యూఓ మల్లికార్జునరావు, లోతేరు పాఠశాల హెచ్ఎం శెట్టి నారాయణ పరామర్శించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



మృతుడు కిల్లో భీమరాజు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గరిమండ గ్రామంలో పిడుగుపాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.... బుధవారం కురిసిన భారీ వర్షానికి పిడుగులు పడ్డాయి. ఈ క్రమమంలో గరిమండ గ్రామానికి చెందిన కిల్లో భీమరాజు (52) పిడుగుపాటకు గురై మృతి చెందాడు. భీమరాజుకు భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని భార్యాపిల్లలు కోరుతున్నారు.